జై బోలో గణేష్ మహరాజ్‌కీ..

- ఉత్సాహంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- గ్రామాలకు ఆధ్యాత్మిక శోభ

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాణసంచా, తీన్‌మార్, మేళతాళాలతో తయారీ కేంద్రాల నుంచి గణనాథుని విగ్రహాలను ఉత్సాహంగా మండపాలకు తరలించారు. భవిష్యత్‌లో విఘ్నాలు లేకుండా చూడాలని విఘ్ననాథునికి మొక్కుకుంటూ అర్చకులచే పూజలు చేయించి వ్రతకథ ఆలకించి అక్షింతలు తలపై వేసుకున్నారు. ఈ సందర్భంగా నవరాత్రులు నిర్వహించే మండపాలు, ఆలయాలు, వీధులు, అపార్టుమెంట్లను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండపాల వద్ద బైటో భజన నిర్వహించారు. మంగళవారం నుంచి మండపాల వద్ద దీపోత్సవాలు, అన్నదానం, ఇతర ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధిలోని ప్రాంతాల్లో ఎక్కువగా పర్యావరణ గణపతులు కొలువుదీరారు. పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీలో దేవతామూర్తులు ఆశీర్వదిస్తున్న నమూనాలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మారికవలస ఆర్‌జీకే కాలనీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో,



పరదేశిపాలెంలో దేవతామూర్తులు ఆశీర్వదిస్తున్న నమూనాలో కొలువుదీరిన గణపయ్య

వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ వార్డు సచివాలయాల కన్వీనర్లు వారణాసి శ్రీనివాసరావు, రుషికేష్, తదితరులు పూజలు చేశారు.

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులోని తిమ్మాపురం, కె.నగరపాలెం, కాపులుప్పాడ, నిడిగట్టు, జేవీ అగ్రహారం ప్రాంతాల్లో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరపాలెంలో, పాతూరులో ఏర్పాటు చేసిన విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 8వ వార్డు ఎండాడ, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో చవితి వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 5వ వార్డులోని కొమ్మాది, మారికవలస,



కీతిన్‌పేట వద్ద ఆకర్షణగా నిలిచిన చంద్రయాన్ 3 నమూనా మండపం

బోరవానిపాలెం, పరదేశిపాలెం ప్రాంతాల్లో గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆనందపురం : మండలంలోని గ్రామాల్లో వివిధ ఆకృతులలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది భారీ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో ఉత్సవ నిర్వాహకులు భాగస్వాములయ్యారు.


పద్మనాభం: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోరాడలో నిలిపిన వినాయక విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు దర్శించుకుని పూజలు చేశారు.

పీఎం పాలెం: స్థానిక గాయత్రినగర్ ఆర్‌హెచ్‌కాలనీ, పాత పీఎంపాలెం, పిలకవానిపాలెంలో భారీ మండపాలు ఏర్పాటు చేసి వినాయక పూజలు చేశారు. శ్రీ శృంగేరీ మఠంలో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

నిమజ్జనానికి తీరంలో ఏర్పాట్లు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో విగ్రహాల నిమజ్జనానికి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతీ సంవత్సరం భీమిలి నియోజకవర్గంతోపాటు, విజయనగరం జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి నిమజ్జనానికి విగ్రహాలు తీసుకొస్తారు. ఈ సారి కూడా భారీగా విగ్రహాలు తీసుకురానున్న నేపథ్యంలో తీరంలోని ఇసుకలో రెండు వైపులా బారికేడ్లు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాల నిమజ్జనానికి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన బందోబస్తు, జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

- కీతిన్‌పేట వద్ద చంద్రయాన్ – 3 నమూనాతో ఏర్పాటు చేసిన మండపం, విగ్రహం ఎంతో ఆకర్షణీయంగా నిలిచింది. భీమిలి గొల్లవీధి కృష్ణమందిరం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది.



పాతూరులో కొలువైన వినాయకుడు



నగరపాలెంలో కొలువైన వినాయకుడు



ఆనందపురంలో వినాయకుని విగ్రహం



భీమిలి గొల్లవీధి వద్ద వినాయక విగ్రహం



సంతపేట కుమ్మరివీధిలో మండపం వద్ద భక్తులు



ఉత్కర్ష ఎమరాల్డ్ అపార్ట్‌మెంట్ మండపంలో విగ్రహం వద్ద భక్తులు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో మట్టి గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



వైఎస్సార్‌కాలనీలో పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



తాటుతూరుతో గణనాథుని విగ్రహం వద్ద రెడ్డి యూత్ సభ్యులు



కోరాడలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



భీమిలి బీచ్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

క్లుప్తంగా

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



నంది వర్ధనాలు, తులసిమాలల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం నంది వర్ధనాలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతపేటకు చెందిన చేట్ల వెంకటరావు, చిన్ని దంపతుల ఆర్థిక సాయంతో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు ఈ అలంకరణ చేశారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అలంకరణతో భక్తులకు మంగళవారం అమ్మవారి దర్శనాలు కల్పించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పోటీల్లో గెలుచుకున్న పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: గాజువాకలో నిర్వహించిన 15వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో భీమిలికి చెందిన షాడో సోటోకాన్ కరాటే అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. కె.బాల స్వరూప్ కాటాస్ విభాగంలో స్వర్ణం, కోటి శివ గణేష్ వెండి, కుముటీ విభాగంలో అబ్దుల్ అర్హన్, వినీత్‌రావు, యజ్ఞేశ్వర్ కాంస్య పతకాలు గెల్చుకున్నారు. వీరిని చీఫ్ కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ అభినందించారు. అక్టోబర్ 8న పెందుర్తిలో నిర్వహించే సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

20 నుంచి మోటార్ సైకిల్ యాత్ర

మధురవాడ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేంత వరకూ పోరాటం సాగుతుందని మధురవాడ జోన్ సీపీఎం కార్యదర్శి డి.అప్పలరాజు అన్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఉక్కు యాత్ర పేరుతో ముద్రించిన పోస్టర్‌ను నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 20 నుంచి 29 వరకు సీపీఎం ఆధ్వర్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మోటారు సైకిల్ యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ యాత్ర ముగింపు సందర్భంగా స్టీల్‌ప్లాంట్ తృష్ణ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని, అందరూ మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజ్‌కుమార్, కొండమ్మ, టీకే శారద, బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీగా కుమార్ బాధ్యతల స్వీకరణ



కేవీఎస్ఎస్ కుమార్

పద్మనాభం: ఈవోఆర్డీగా కె.వి. ఎస్.ఎస్.కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం డీపీవో ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈవోఆర్డీగా పదోన్నతిపై పద్మనాభం వచ్చారు.

మహిళా మార్టుతో ఆర్థిక స్వావలంబన

పద్మనాభం: మండల మహిళా మార్టుతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభంలో రూ.58 లక్షలతో నిర్మిస్తున్న భవనం వద్ద మండల మహిళా మార్టు బోర్డు డైరెక్టర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో పాటు మిగతా వస్తువులను విక్రయించగా వచ్చిన ఆదాయంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమవ్వాలని సూచించారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి మండల మహిళా మార్టులో డైరెక్టర్లుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మండల మహిళా మార్టు బోర్డు డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

మొక్కలు నాటేలా ప్రోత్సహించాలి

భీమునిపట్నం: విద్యాసంస్థల్లో పౌష్టికాహారం కోసం విద్యార్థులు మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులతో పలు రకాల కూరగాయల విత్తనాలు మంగళవారం నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు చోట్ల విద్యార్థులతో వ్యవసాయం చేయించడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ ఇటువంటి వాటి ద్వారా విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, తాము కూడా పలు మొక్కలు పెంచుతున్నామని తెలిపారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

బులుసు 'జీవనవాహిని'కి తానా పురస్కారం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌కు చెందిన ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు రచన జీవనవాహినికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రూ.లక్ష నగదు పురస్కారం అందించింది. ఈ నెల 17న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తానా ప్రపంచ సాహిత్యవేదిక ఈ పురస్కారం అందించింది. ప్రముఖ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మృత్యర్థం 2023 సంవత్సరానికి ఈ పురస్కారాన్ని సినీ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి, నిర్వాహకులు తోటకూర ప్రసాద్, సీతారామశాస్త్రి సోదరుడు రామశాస్త్రి, సినీ గీత రచయిత రామజోగయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



మురళీమోహన్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న బులుసు వెంకటేశ్వర్లు

ఆదర్శనగర్‌లో జెడ్సీ మండిపాటు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో స్థానికులపై జెడ్సీ బి.రాము మంగళవారం మండిపడ్డారు. ఇక్కడి పారిశుధ్య సమస్యను ఇటీవల మధురవాడ నుంచి బదిలీపై వచ్చిన శానిటేషన్ కార్యదర్శి ఒకరు జెడ్సీ దృష్టికి తీసుకురావడంతో ఆయన క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. డ్రైనేజీ తొలగించి ఉండటంతో మురుగునీరు పక్కనే ఉన్న స్థలాల్లోకి వెళ్లిపోతుందని, దీనిని వెంటనే నిర్మించాలని ఒక్కసారిగా స్థానికులు ఆవేశం వ్యక్తం చేశారు. రూ.5 లక్షలు లంచంగా ఇచ్చినా పనులు జరగడం లేదని తీవ్రంగా ఆరోపణలు చేశారు. దీంతో జెడ్సీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అభివృద్ధి పనులు చేస్తున్నా తప్పుడు ఆరోపణలు తగదన్నారు. స్థానికులు సహకరిస్తే డ్రైనేజీల నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఒకదశలో జెడ్సీ తమను కొట్టారని ఆదర్శనగర్ వాసులు ప్రచారం చేశారు. ఇందులో నిజం లేదని తర్వాత వారు వెనక్కు తగ్గారు.

బురద నీరే దిక్కు..!

- గోస్తనీకి వరద పోటెత్తడంతో ఇబ్బందులు
- భీమిలి జోన్ ప్రజలకు తాగునీటి కష్టాలు

తగరపువలస: గోస్తనీనదికి వరదనీరు పోటెత్తడంతో జీవీఎంసీ భీమిలి జోన్‌లో కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు బురదగా వస్తోంది. ఇదే గోస్తనీ నది నుంచి జీవీఎంసీ పరిధిలో విశాఖ నగరానికి కూడా నీరు సరఫరా అవుతున్నా అక్కడ శుభ్రం చేసి అందిస్తున్నారు. భీమిలి, తగరపువలస, చిట్టివలస, సంగివలస పరిధిలోని ప్రజలకు తాగునీరు అందించేందుకు గోస్తనీనదిలో సామియ్యవలస, టి.నగరపాలెం గ్రామాల వద్ద నదిలో 9 ఊటబావులు ఉన్నాయి. ఈ బావుల ద్వారా తగరపువలస, చిట్టివలసలోని కృత్రిమ రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి తాగునీటి అవసరాలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తారు. వర్షాలు కురిసినప్పుడు నదిలో బురద శాతం ఎక్కువగా ఉండి నీరు ఎర్రగా ఉంటుంది. ఎండ కాస్తే నదిలో బురదనీరు తగ్గుతుంది. లేదంటే కృత్రిమ రిజర్వాయర్లలో నీటికి ఆలం, క్లోరిన్ చేర్చిన తర్వాత నీరు సరఫరా చేస్తారు. అయినప్పటికీ నీరు బురదగా ఉండడంతో ఎవరూ తాగడానికి ఇష్టపడడం లేదు. భీమిలి జోన్‌లో నీటిని ఫిల్టర్ చేసే సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో తరచూ వర్షాకాలంలో సరఫరా అయ్యే బురదనీరు తాగలేక ప్రైవేటుగా కేన్ల ద్వారా విక్రయించే నీటిని కొనుక్కుని తాగుతున్నారు. ఒక్కోసారి కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిలో క్రిములు, కీటకాలు వచ్చి చేరుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోస్తనీనదిలో టి.నగరపాలెం ఊటబావి వద్ద బురదనీరు

విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన

భీమునిపట్నం: స్థానిక యాతపేట, కుమ్మరిపాలెం, ఫిషర్‌మెన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. వారి వర్క్‌బుక్స్, నోటు పుస్తకాలు పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ఆ మేరకు బోధన సాగించాలని వెల్లడించారు.

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన బోయి భీమన్న గురించి వివరించారు. పేదరికం, అంటరానితనం వంటి దురాచారాలు చిన్నప్పటి నుంచి భీమన్న ఎదుర్కొని వాటిని నిరసిస్తూ పుస్తకాలు రాశారని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు హిందీ దోహదం

తగరపువలస: దేశ సమగ్రతకు హిందీ భాష దోహదపడుతుందని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. హిందీ దివస్ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం భీమిలి గవర్నమెంట్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. హిందీ నేర్చు కుంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



యోగిత, మేఘన

పద్మనాభం: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బాలికల విభాగంలో పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. అడవివరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని టి.యోగిత అండర్ 14 విభాగంలో, తొమ్మిదో తరగతి విద్యార్థిని మేఘన అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో ఈ నెల 29 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరి ఎంపిక పట్ల హెచ్‌ఎం ఎ.బాలామణి, పీడీ నారాయణమ్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయుడు, విలాస్కాన్‌పాలెం మాజీ సర్పంచ్ నల్లి సన్యాసప్పడు ఏపీఈపీడీసీఎల్ మధురవాడ ఈఈ పోలాకి శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం అందించారు. బాందేవుపురంలో అపహరణకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది వేయాలని, అదే పంచాయతీ రెల్లిపేటలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని, విలాస్కాన్‌పాలెంలో పాడైపోయిన రెండు ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి వేయాలని వినతిపత్రంలో కోరారు. రామసింగు ముత్యాలనాయుడు, రామసింగు ముత్యాలప్పడు, కంటుబోతు రామకృష్ణ తదితరులు వినతిపత్రం ఇచ్చారు.



ఈఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టీడీఆర్ సమస్య పరిష్కారానికి చర్యలు

మధురవాడ: రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డుకు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ సమస్య పరిష్కారానికి అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ 31 మందికి టీడీఆర్ ఇవ్వడానికి అధికార యంత్రాంగం సుముఖత వ్యక్తం చేయగా బాధితులను కూడా ఒప్పించి రోడ్డు నిర్మించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డీసీపీ నరేంద్రనాథ్ రెడ్డి బాధితులతో మాట్లాడారు. అయితే బాధితులు మాత్రం నెల రోజులు సమయం కావాలని అడిగారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డులో హైవే నుంచి నవోదయ వరకు గల 2.4 కిలోమీటర్ల మార్గంలో అక్కడక్కడా కొన్ని ప్రాంతాలు 450 మీటర్ల మేర ఉండిపోయాయని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు మార్కింగ్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో టీపీవో వర ప్రసాద్ పాల్గొన్నారు.



కొమ్మాది నవోదయ వద్ద రోడ్డు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

లబ్ధిదారుల ఇంటికే పథకాలు



తాళ్లవలసలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ వాసురాజు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా ఏనాడూ పథకాలు సవ్యంగా పంపిణీ చేయలేదని ఆరోపించారు. మంగళవారం సాయంత్రం భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికులతో ఆయన మాట్లాడారు. పంచాయతీలో రూ.21 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పంచాయతీలో గతంలో టీడీపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు రభస చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా దేశంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. గతంలో పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని... ప్రస్తుతం పంచాయతీలోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సేవలన్నీ ప్రజల ముంగిట్లోకి తీసుకొచ్చామని తెలిపారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పంచాయతీలో గొల్లల తాళ్లవలస, కొంగరాణి వారి కళ్లాలు, యాతపేట, పీహెచ్‌సీ రహదారిలో డ్రైనేజీలు, సీసీరోడ్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకోగా... వాటి పరిష్కారానికి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. దోమల నివారణకు పారిశుధ్య పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే గుర్తించి మళ్లీ దరఖాస్తు చేసేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ బోని జగ్గమ్మ, సన్నిబాబు, ఉప సర్పంచ్ సింగపూర్ బుజ్జిరాజు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, అక్కరమాని అప్పలనాయుడు, చిల్ల హరి, ఎలమంచిలి మురళీకృష్ణ, దంతులూరి వేణురాజు, గొలగాని సన్యాసిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమ్మిడి శ్రీనివాసరావు, గాడు వెంకటనారాయణ, చెల్లూరి నగేష్, కాద సూర్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, అక్కరమాని ఆదిబాబు, పల్లా సన్యాసిరావు, అక్కరమాని రమణ తదితరులు పాల్గొన్నారు.